
## క్లుప్తంగా

### పంపిణీకి సిద్ధంగా డస్ట్ బిన్‌లు



పురిటిపెంట సచివాలయం-2లో భద్రపరిచిన చెత్తసేకరణ బుట్టలు

గజపతినగరం: ఇంటింటి నుంచి తడి,పొడి చెత్తను సేకరించేందుకు సుమారు 24 వేల చెత్తసేకరణ బుట్టలను మండ లానికి ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని పంచాయతీ అధికారులు విడతల వారీగా త్వరలో ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం వీటిని అధికారులు గజపతినగరం,పురిటిపెంట గ్రామ సచివాలయాల్లో భద్రపరిచారు.

### అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గజపతినగరం: స్థానిక దిగువ వీధిలో శ్రీరామ దూత యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుమారు మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఆసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం అనంతరం అన్నసమారాధన చేశామని చెప్పారు. గజపతినగరం,ఎం.వెంకటాపురం,ఎస్.జి.ఆర్.పురం, దావాలపేట, బూడిపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

### రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.14 కోట్లు




రైల్వేస్టేషన్‌ను సందర్శిస్తున్న బీజేపీ నాయకులు

చీపురుపల్లి: అమృత్ భారత్ పథకం ద్వారా చీపురుపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసిందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్.వి.ఎల్.ఎస్.రాజు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం ఆదివారం సందర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ నాయకులు మన్నెపురి శ్రీనివాసరావు, వెంకటఅప్పారావు, ఇమంది వెంకటరావు, త్రినాథ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

### చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీనివాస్

గంట్యాడ: చేతుల శుభ్రత పాటించడం వల్ల చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు హ్యాండ్ వాష్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న చేతులతో ఆహార పదార్థాలు తినడం వల్ల టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. వెలుగు సీసీలు చినబాబు, అచ్చంనాయుడు ముత్యాలనాయుడు, గౌరీశ్వరి పాల్గొన్నారు.

### రూ.39 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ



కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి వింద్యావాసి గ్రామానికి వేసిన తారురోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని వింద్యావాసి గ్రామ తారురోడ్డును ఏఎంసీ నిధులు రూ.39 లక్షలతో ప్రభుత్వం పునరుద్ధరించింది. గతంలో ఈ రోడ్డు గోతులు తేలి అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడేవారు. గ్రామానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కోసం వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించారు. తప్పక రోడ్డు పునరుద్ధరణ చేపడతామని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హామీ మేరకు రోడ్డు పనుల కోసం రూ.39 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో కొద్ది రోజుల క్రితమే కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి వింద్యావాసి గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభించి పూర్తి చేశామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే అప్పలనరసయ్య తమ గ్రామ రోడ్డు పునరుద్ధరణ పనులు చేయించారని సర్పంచ్ రంభ చంద్రశేఖర్, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంత దేవాలయాల్లో తొలిరోజు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల వద్దకు అమ్మవారి విగ్రహాలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. తొలిరోజు భక్తులకు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. శృంగవరపుకోట పట్టణంలోని దేవీ జంక్షన్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 5 కిలోల వెండి కిరీటం చేయించారు. ఈ కిరీటాన్ని కమిటీ సభ్యుల సమక్షంలో అమ్మవారికి అలంకరించారు.

– శృంగవరపుకోట/ బొండపల్లి/ జామి/ గంట్యాడ/వేపాడ/దత్తిరాజేరు/గుర్ల/ కొత్తవలస/లక్కవరపుకోట



వేపాడ: ముకుందపురంలోని దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భవానీలు



శృంగవరపుకోట: ఎస్.కోట దేవి జంక్షన్‌లోని దుర్గాదేవి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు



జామి: అలమండలోని దుర్గామాత ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న అమ్మవారు



గంట్యాడ: పెదవేమలిలోని కాళికామాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



లక్కవరపుకోట: ఎల్.కోటలో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



గుర్ల: గుర్లలో ఏర్పాటు చేసిన మండపంలో బాలాత్రిపుర సుందరిదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



బొండపల్లి: అంబటివలసలోని సంతోషిమాత ఆలయం వద్ద మండపంలో ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహం



దత్తిరాజేరు: గడసాంలో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవసల: కొత్తవలసలోని విశాఖపట్నం రోడ్డులోని దుర్గాదేవి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవార్లు



కొత్తవలస: కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

# అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



లక్కవరపుకోట: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కలాం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు



చీపురుపల్లి: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆశయ రమణ, విద్యార్థులు

కొత్తవలస: భారతరత్న, మాజీ రాష్ట్రపతి, భారతదేశ క్షిపణి పితామహుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవా లని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) సీహెచ్.రాజేష్ అన్నారు. ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యా లయ ఆవరణలోని కలాం విగ్రహానికి వీఆర్‌ఓలతో కలిసి ఆర్ఐ పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ భారత క్షిపణుల పరిజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు కలాం అని కొనియాడారు. పేపర్ బాయ్ నుంచి భారత్ రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

**హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..**

లక్కవరపుకోట: స్థానిక బీసీ కాలనీలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కార్యదర్శి బండ గోవిందరావు తదితరులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

**పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో..**

చీపురుపల్లిరూరల్(గరివిడి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని గరివిడి పెన్షనర్ల సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పెన్షనర్ల సంఘం ప్రతినిధులు వై.సత్యం, కె.పైడినాయుడు, వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, శ్రీరామరాజు,ఆర్.ఎన్.అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**'ఆశయ' ఆధ్వర్యంలో**

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రజా గ్రంథాలయంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థులు దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణ మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ అబ్దుల్ కలాం చెప్పిన మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

# పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి

గంట్యాడ: ప్రాథమిక పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి రామభద్ర రాజు అన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ప్రభుత్వం శాఖా గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహిస్తోంది.స్థానిక గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి రామభద్రరాజు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పుస్తకపఠనంతో విజ్ఞానం, ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబం ధించిన పుస్తకాలు, నీతికథలు, ఇతిహాసాలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలని సూచించారు.

**గ్రంథాలయాలను సద్వినియోగించుకోండి**

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని గరివిడి శాఖా గ్రంథాలయం అధికారి ఎం.ఉషారాణి సూచించారు. దసరా సెలవులను పురస్క రించుకుని స్థానిక గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులకు కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తామని, అలాగే క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజున విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు కె.పాపారావు హ్యాండ్ రైటింగ్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థినితో కథలు చెప్పిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి



గంట్యాడ: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

# రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక సర్వేపల్లి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ సన్యాసిరావు ఆదివారం తెలిపారు. ఇటీవల మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బాలికలు, బాలుర విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ఎం.హారిక, కె.పురందేశ్వరి, డి.రోహిత్‌సాయి, ఎం.మణీంద్ర ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్,జయరాజ్‌ను ప్రిన్సిపాల్ పైడిరాజు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పైడిరాజు, పీడీలు

# బొడ్డవరలో వాసవీక్లబ్ ఏర్పాటు



వాసవీక్లబ్ కార్యవర్గ సభ్యులు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామంలో కొత్తగా వాసవీక్లబ్ ఆదివారం ఏర్పాటైంది. కార్యక్రమానికి వాసవీ క్లబ్ రాష్ట్ర ప్రతినిధులతో పాటు స్థానిక క్లబ్‌ల సభ్యులు హాజరయ్యారు. ముందుగా సభ్యులు అంతా వాసవీమాతకు పూజలు చేశారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటైన వాసవీ క్లబ్‌కు కార్యవర్గాన్ని రాష్ట్ర సభ్యులు రేపాక సర్వదేముళ్లు, యు.సత్యారావు, సోమేశ్వరరావు, కె.రమేష్ తదితరులు నియమించి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షురాలిగా పూసర్ల కోటిరత్నం, కార్యదర్శిగా కందుకూరి శైలజ, కోశాధికారిగా ధనలక్ష్మి, తదితర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్.కోట మహిళా వాసవీ క్లబ్ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న మహిళలు అంతా తమ క్లబ్‌ల ద్వారా నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. సేవే మార్గం, అంతిమ లక్ష్యంగా క్లబ్‌లు నడవాలని, క్లబ్ లక్ష్యాల సాధనలో తామంతా ఉంటామని వారంతా తమ మద్దతు పలికారు.

## నేటి కార్యక్రమాలు

**జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాలు**

వేపాడ/బొండపల్లి: వేపాడ మండలంలోని నీలకంఠరాజపురం, బొండపల్లి మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో సోమ వారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు వేపాడ ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, బొండపల్లి ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వైద్యశిబిరాల్లో వైద్యనిపుణులు సేవలందిస్తారని పేర్కొన్నారు. వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు చికిత్స చేస్తారని, నేత్ర పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేయడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని పేర్కొన్నారు. ఆయా సచివాలయాల పరిధి ప్రజలు ఈసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం**

జామి: ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలంలోని 13 గ్రామాలకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులతో అలమండ సచివాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం సమావేశం కానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి లబ్ధిదారులతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

**ఎంపీడీఓ కార్యాలయాల్లో 'స్పందన'**

బొండపల్లి/ దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని బొండపల్లి, దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓలు వై.వి.రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

### ఒలింపియాడ్‌లో సత్తా చాటిన బాలికలు



విద్యార్థినులను, వారి తల్లులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శాంతి

శృంగవరపుకోట: స్థానిక మహంతి గ్లోబల్ స్కూల్‌కి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో సత్తా చాటారు. ఒలింపియాడ్ అకాడమీ రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన రామానుజన్ గణిత మహోత్సవం (ఆర్.ఎం.ఎం)లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.రేష్మ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, 6వ తరగతి విద్యార్థిని పి.లాస్య తృతీయ స్థానం సాధించారు. గణితంలో ప్రతిభ చాటిన ఈ విద్యార్థినులను వారి తల్లుల సమక్షంలో ప్రిన్సిపాల్ శాంతిమహంతి ఆదివారం అభినందించారు.

# స్వర్ణకవచాలంకృత అలంకరణలో కనకమహాలక్ష్మి



ప్రతిష్ఠాపనకు శ్రీచక్రం తీసుకువెళుతున్న ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాషరావు, భక్తులు



స్వర్ణకవచాలంకృత అలంకరణలో అమ్మవారు

చీపురుపల్లి: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీ చక్రము( మేరువు) ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాషరావు(గోవింద), సుధారాణి, వైస్ చైర్మన్ సూరు కుమార్ దంపతుల నేతృత్వంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో చండీ హోమం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, సామూహిక కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎంపీటీసీ ఇప్పిలి సుధారాణి, ఈఓ జి.శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### అభివృద్ధి పథంలో ఆనందపురం



మొరగాన వీధిలో వేసిన సీసీ రోడ్డు



మొండి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

గుర్ల: మండలంలోని ఆనందపురంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో గ్రామంలోని సచివాలయం వీధిలో రూ.4.80 లక్షలతో సీసీ రోడ్డు, మొరగాన వీధిలో రూ.2.80 లక్షలతో సీసీ రోడ్డు, కాలువలు, మొండి వీధిలో రూ.2.80 లక్షలతో రెండు సీసీ రోడ్లను నిర్మించామని సర్పంచ్ మీసాల సత్యవతి ఆదివారం తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడడంతో గ్రామ స్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.